



పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నేడే కౌంటింగ్

- అందరి ఉత్కంఠకు తెర
- తేలిపోనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభం
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం



ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

పార్వతీపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సుదీర్ఘ నిరీక్షణకు.. నరాలు తెగే ఉత్కంఠకు తెరపడనుంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఎన్నికల రణక్షేత్రంలో విజేతలెవరో.. పరాజితులెవరో తేలబోతోంది. ఎవరి ఆశలు ఫలించాయో.. ఎవరికి నిరాశ మిగిలిందో.. ఈవీఎంలు చెప్పబోతున్నాయి. గెలుపు గుట్టు విప్పబోతున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. ఇది జరుగుతుండగానే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈవీఎంల ఓట్లు లెక్కిస్తారు. అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. మధ్యాహ్నానికి అభ్యర్థుల విజయావకాశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కూటమి అభ్యర్థులతో పాటు వైసీపీ అభ్యర్థులూ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల కోసం ప్రజలు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు.

ఫలితాలు ఇలా

- పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో 233 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 17 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుంది. ఈ నియోజకవర్గంలో 1,89,817 ఓట్లకు గాను 1,48,502 ఓట్లు పోలయ్యాయి. సాలూరు నియోజకవర్గ పరిధిలో 243 పోలింగ్ బూత్‌లు ఉండగా.. 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఈ నియోజకవర్గంలో 2,04,489 ఓట్లకు గాను 1,56,331 ఓట్లు పోలయ్యాయి. కురుపాం నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకు గాను 20 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుంది. 1,94,114 ఓట్లకు గాను 1,52,452 ఓట్లు పడ్డాయి. పాలకొండ నియోజకవర్గంలోని 287 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓట్లు లెక్కింపు ఉంటుంది. 21 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవు తుంది. ఇక్కడ 1,95,020 ఓట్లు ఉండగా 1,46,781 ఓట్లు పోలయ్యాయి. జిల్లా పరిధిలో 77.10 శాతం మేర పోలింగ్ నమోదైంది.
- సాలూరు నియోజకవర్గం ఓట్లు లెక్కింపు సుమారు 9 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. దీని ఫలితం సాయంత్రం నాలుగు గంటలలోపు అధికారికంగా ప్రకటించవచ్చు. కురుపాం నియోజకవర్గం ఫలితం సాయంత్రం ఆరు గంటల తర్వాత , పాలకొండ నియోజకవర్గం ఫలితం రాత్రి ఏడు గంటలకు ప్రకటించే అవకాశం ఉంది.
- ఒక్కో రౌండ్‌లో ఓట్లు లెక్కింపునకు సంబంధించి సుమారు 30 నిమిషాల పైబడి సమయం పట్టొచ్చు. కౌంటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం మూడు గంటల్లోపు పూర్తయితే సాయంత్రం నాలుగు గంటలకు పూర్తి స్థాయిలో రిటర్నింగ్ అధికారి ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది.

ప్రత్యేక పాస్‌లు ఉంటేనే అనుమతి...

ప్రత్యేక పాస్‌లు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు అనుమతి ఇస్తారు. ఏజెంట్లు వారికి కేటాయించబడిన టేబుల్స్ వద్ద ఉండాలి. కౌంటింగ్ పూర్తయ్యేవరకు బయటకు రాకూడదు. ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. ఏజెంట్లకు ఏమైనా సందేహాలుంటే టేబుల్ వద్ద ఉండే సూపర్‌వైజర్ లేదా ఇతర అధికారి ద్వారా రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి.

తొలిసారిగా జిల్లాలో...

జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా 'మన్యం'లో ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపడుతున్నారు. గతంలో విజయనగరంలో లెక్కించేవారు. కాగా ఈసారి పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. అరకు పార్లమెంట్ పరిధి పాడేరు, రంపచోడవరం, అరకు నియోజకవర్గాలను చెందిన పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇక్కడే లెక్కించనున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్టు తప్పదు

ఏ అభ్యర్థి తరపు ఏజెంట్‌గా వెళ్లినా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు కౌంటింగ్ కేంద్రం వద్దే ఉండాలి. ఓట్ల లెక్కింపు సిబ్బంది చెప్పిన తర్వాతే బయటకు వెళ్లాలి. నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టారాజ్యంగా కౌంటింగ్ కేంద్రంలో వ్యవహరిస్తే ఆర్వో ఆదేశాల మేరకు వెంటనే అరెస్టు చేయనున్నారు.

పటిష్ఠ బందోబస్తు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య జరుగుతుంది. ఎస్పీ విక్రాంత్ పటిల్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర కేంద్ర బలగాలు కూడా కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నాయి. సీసీ కెమెరాలు, డ్రోన్ల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

గరుగుబిల్లి, జూన్ 3 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించనున్న కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సోమవారం ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాలతో పాటు అరకు పార్లమెంట్ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కింపు జరగనుందన్నారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని ఈవీఎంల ఓట్లును కూడా ఇక్కడే లెక్కించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ఒక కేంద్రం, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 9 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈవీఎంలకు సంబంధించి 14 టేబుళ్లు, పార్ల మెంట్ పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇనుప మెస్‌లతో ధృడంగా బారికేడ్లు ఏర్పాటు చేశామ న్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వాటి పరిధిలో సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. 158 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్‌లు నిరంతరం పనిచేస్తాయని, లెక్కింపు ప్రాంతాల్లో ఇతరులు డ్రోన్లు, మరే పరికరాలను ఎగుర వేయరాదని, ఆ ప్రాంతాన్ని నో ఫ్లైజోన్‌గా ప్రకటించామని వెల్లడించారు. కళాశాల ఆవరణలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించేందుకు వీలుగా పలు రకాల ఏర్పాట్లు చేశామని, వాటిని కంట్రోల్ రూముకు అనుసంధానం చేశామని చెప్పారు.

అమలులో 144 సెక్షన్..

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని కలెక్టర్ తెలిపారు. లెక్కింపు కేంద్రం పరిధిలో ఎస్పీ, ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 17 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, 500 మంది పోలీసులు, ఒక కేంద్ర బలగంతో పటిష్ఠ బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశామన్నారు. అదనంగా మూడు కేంద్ర బలగాలు రానున్నట్లు వివరించారు.

ప్రత్యేక మార్గాలు

కౌంటింగ్ కేంద్రానికి వచ్చే సిబ్బందికి, ఎన్నికల ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు, సూచికలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ సిబ్బంది మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలతో పాటు అరెస్టు తప్పదని స్పష్టం చేశారు.

మొదటి ఫలితం పార్వతీపురానిదే..

ఓట్ల లెక్కింపులో భాగంగా మంగళవారం మొదటి ఫలితం పార్వతీపురం నియోజకవర్గానిదే కానుందని కలెక్టర్ వెల్లడించారు. తదుపరి నిబంధనల మేరకు వరుస క్రమంలో నిర్దేశించిన సమయంలోగా ఫలితాలు ప్రకటన ఉంటుందన్నారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ శోభిక, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ, ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, సునీల్ షరోన్, డీఎస్పీలు జీవీ కృష్ణారావు, మురళీధర్, హర్షిత, వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు.



స్ట్రాంగ్ రూములో ఉన్న ఈవీఎంలు

సమన్వయంతో పనిచేయాలి: ఎస్పీ

గరుగుబిల్లి, జూన్ 3 : ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యాన కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తు, విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ సెంటర్ లోపలికి ప్రవేశించే ప్రతి ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి గుర్తింపు కార్డు పరిశీలన అనంతరం అనుమతించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రదేశాల్లో వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయించాలని ఆదేశించారు. సీఆర్‌పీసీ 144 సెక్షన్, 30 యాక్టు అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడకుండా చూడాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీలులేదని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా బందోబస్తులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అప్రమత్తతో విధులు నిర్వహించాలని సూచించారు. సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ

సురక్షితమేనా..?

- రక్షిత పథకాల్లో కానరాని శుభ్రత, క్లోరినేషన్
- మురుగు కాలువల్లో పైపు లైన్లు
- లీకేజీలు ఉన్నా పట్టించుకోని వైనం
- కలుషిత నీటితో ప్రజలు రోగాల పాలు
- స్పందించని అధికారులు

(జియ్యమ్మవలస)

ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. మరీ ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటిపై స్పందించే వారు కరువయ్యారు. జిల్లాలో అనేక చోట్ల రక్షిత పథకాల్లో క్లోరినేషన్, శుభ్రత కరువైంది. మురుగు కాలువల్లోనే పైపు లైన్లు దర్శనమిస్తున్నాయి. లీకేజీలు ఉన్నా పట్టించుకునే వారే లేరు. కలుషిత నీటితో తరచూ ప్రజలు రోగాలపాలవుతున్నారు. 'కాచి చల్లార్చిన నీటిని తాగండి' అంటూ అధికారులు ప్రకటనకే పరిమితమవుతున్నారు. సురక్షితమైన తాగునీరు అందించేందుకు కనీస చర్యలు చేపట్టడం లేదు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు కూడా సక్రమంగా సాగడం లేదు. దీంతో ఈ సీజన్‌లో వ్యాధిగ్రస్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మేల్కొని ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తాగునీటి వనరులు ఇలా..

- జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,282 గ్రామాలు ఉండగా, 2,14,633 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరందరికీ తాగు నీరందించేందుకు కాంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ స్కీమ్ (సీపీడబ్ల్యూఎస్)లు 11, రక్షిత పథకాలు (పీడబ్ల్యూఎస్) 808, చిన్న తరహా నీటి పథకాలు (ఎంపీడబ్ల్యూఎస్) 491, సోలార్ నీటి పథకాలు 407, డైరెక్ట్ పంపింగ్‌లు 1525, బోర్లు 7518, ఇతర మార్గాల్లో తాగునీరందించే వనరులు మరో 301 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా 8,965 ఇంటి కనెక్షన్లు ఉన్నాయి.
- రక్షిత నీటి పథకాల ద్వారా ఒక ఇంటికి రోజుకు 55 లీటర్ల నీరు అందించే కొళాయి కనెక్షన్లు (ఎఫ్‌సీ) 1,397, 15 లీటర్ల నీరందించే కనెక్షన్లు (పీసీ) 90, 30 లీటర్ల వరకు ఇచ్చే కనెక్షన్లు (పీసీ-2) 265, 40 లీటర్లు తాగునీరందించే కనెక్షన్లు (పీసీ-3) 310, 50 లీటర్ల నీటిని అందించే కనెక్షన్లు (పీసీ-4) 220 ఉన్నాయి. వీటి ద్వారా సురక్షితమైన తాగునీరందించే అవకాశం పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అలా జరగడం లేదు.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేందుకు అనేక వనరులు ఉన్నాయి. కానీ అనేక గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత నీటి పథకాల నిర్వహణ చాలా దారుణంగా ఉంది. వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. నిబంధనల ప్రకారం బోర్లు రిపేర్లు, వాటి నిర్వహణకు మండల పరిషత్ పర్యవేక్షించాల్సి ఉంది. రక్షితనీటి పథకాల నిర్వహణ, పారిశుధ్యం మెరుగుపర్చడం పంచా యతీలదే పూర్తి బాధ్యత. వీరు ఎక్కడ ఎటువంటి రిపేర్లు ఉన్నా వెంటనే సరిచేసి ప్రజలకు సురక్షితమైన తాగు నీరందించాల్సి ఉంది. అంతేకాకుండా రక్షిత నీటి పథకం ట్యాంకులను ప్రతి రెండు వారాలకొకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉంది. ఆ ట్యాంకులపై శుభ్రం చేసిన తేదీ, మళ్లీ క్లీన్ చేయాల్సిన తేదీ విధిగా నమోదు చేయాలి. కానీ జిల్లాలో దాదాపు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. వర్షాకాలం ప్రారంభం కానున్న తరుణంలో అనేక చోట్ల కాలువల్లో పూడికతీతలు కూడా ఇంకా తీయడం లేదు. బావుల్లో క్లోరినేషన్ చేయడం లేదు. ఏ గ్రామంలోనైనా వ్యాధులు ప్రబలిన సమయంలో వైద్య సిబ్బందితోకలిసి ట్యాంకులు శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం వంటివి చేస్తున్నారు. అంతవరకు వాటి వైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఫలితంగా ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం నిధులు లేమి అని సర్పంచ్‌లు చెబుతున్నారు.

మురుగు కాలువల్లో..

పట్టణాల్లో, గ్రామాల్లో చాలా చోట్ల రక్షిత పథకాల పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయి. లీకేజీ కారణంగా నీరు కలుషితమవుతున్నా ఎవరూ స్పందించడం లేదు. ఫ్రై డే డ్రైడే అంటూ హడావిడి చేసే పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఆ రోజు రక్షిత నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల అలా జరగడం లేదు. ఇప్పటికే విష జ్వరాలు, ఇతరత్రా వ్యాధులతో పదుల సంఖ్యలో జిల్లావాసులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. రానున్న రోజుల్లో వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కురుపాంలో పిచ్చి మొక్కల మధ్య ఉన్న మినీ రక్షిత నీటి పథకం



గెడ్డ తిరువాడలో మురుగు కాలువ ఇలా..

ఇబ్బందులు పడుతున్నాం

ఈ ఏడాదిలో మార్చి నెలకు ముందు పంచాయతీలకు కొంత నిధులు మాత్రమే జమ చేశారు. కానీ రెండో విడత నిధులు ఇంకా జమ కాలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పల్లెల్లో పనులేవీ చేయలేకపోతున్నాం.

- మరడాన దాలినాయుడు, సర్పంచ్, చింతలబెలగాం

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

రానున్న వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నాం.

- పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస



మురుగు కాలువలో ఉన్న పైపులైన్

సమస్యాత్మక గ్రామాల్లో
పోలీస్ పికెట్

సాలూరు రూరల్, జూన్ 3: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం నుంచి పోలీసులు అప్రమత్తమయ్యారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో జిల్లాలో భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. వాటిని రూట్ల వారీగా విభజించి పోలీసు పెట్రోలింగ్ చేస్తున్నారు. మండలాల వారీగా స్ట్రయికింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సమస్యలు తలేత్తె అవకాశమున్న గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ ఏజెంట్లు
అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించేవారు తమకు ఏజెంట్లుగా అవసరం లేదని రాష్ట్రస్థాయిలో వైసీపీకి చెందిన ఒక నాయకుడు మాట్లాడినట్లుగా సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ సమయంలో వైసీపీ వర్గాలు గొడవలు, ఘర్షణకు దిగే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థుల ఏజెంట్లు కౌంటింగ్ ముగిసే వరకు జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి సందేహాలున్నా రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచిస్తున్నారు. రీ కౌంటింగ్ అవసరం అనుకుంటే అప్పీలు చేయాల్సి ఉందని చెబుతున్నారు.

జిల్లాకేంద్రానికి అభ్యర్థులు

పార్వతీపురం, జూన్3 (ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర పార్వతీపురంలోనే నివాసం ఉంటున్నారు. కాగా నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏజెంట్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. సాలూరు నుంచి టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి , పాల కొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో కౌంటింగ్ ఏజెంట్లు పార్వతీపురం చేరుకున్నారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు జిల్లా కేంద్రానికి చేరుకోవడంతో ఎక్కడ చూసినా రాజకీయ ప్రస్తావనలే కనిపించాయి.



క్లీంకారకు కల్కి టీమ్ గిఫ్ట్స్

విడుదల తేదీ దగ్గర పడడంతో 'కల్కి 2898 ఏ.డీ' చిత్ర బృందం ప్రచారం జోరు పెంచింది. ప్రమోషన్స్‌లో భాగంగా స్టార్ కిడ్స్‌కు గిఫ్ట్‌ను పంపిస్తోంది. ఇటీవలే ఈ గిఫ్ట్స్ రామ్‌చరణ్, ఉపాసనల కూతురు క్లీంకారకు చేరాయి. ఆ బహుమతుల్లో బుజ్జి-భైరవ స్టిక్కర్స్, బుజ్జి క్యారెక్టర్ బొమ్మ, టీషర్ట్‌లు ఉన్నాయి. ఆ గిఫ్ట్‌తో ఆడుకుంటున్న క్లీంకార ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఉపాసన.. కల్కి టీమ్‌కు కృతజ్ఞతలతో పాటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ప్రచారంలో భాగంగా త్వరలోనే మరింత మంది సెలబ్రిటీల పిల్లలకూ ఈ గిఫ్ట్స్ అందుతాయట. కాగా, అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా తెరకెక్కింది.

హిలేరియస్ ఎంటర్‌టైనర్



అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా ఛటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ, విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/CWjbW6W లో చదవండి.

అటు రజనీకాంత్.. ఇటు ఎన్టీఆర్





తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం హిమాలయ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంలో కేదార్‌నాథ్, బద్రీనాథ్ దేవాలయాలను సందర్శించిన రజనీకాంత్ ఇప్పుడు అక్కడున్న సాధువులను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఓ సాధువుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూనే తన సినిమాల ముచ్చట్లు కూడా వివరించారు. ప్రస్తుతం 'వెట్టియాన్‌'లో నటిస్తున్నాను. నా వర్క్ పూర్తయింది. మిగిలిన నటీనటుల మీద చిత్రీకరణ జరుగుతోంది. విజయదశమి సందర్భంగా అక్టోబరు పదిన ఆ సినిమా విడుదల చేయాలనుకుంటున్నారు. నా కొత్త సినిమా 'కూలీ' షూటింగ్ ఈ నెల పదిన ప్రారంభమవుతుంది. ఈ సినిమాలకు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారు' అని ఆ సాధువుకు చెప్పారు రజనీకాంత్. జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున రజనీకాంత్ సినిమా కూడా వస్తుండడంతో ఈ రెండు చిత్రాల మధ్య పోటీ తప్పదంటున్నారు సినీ పరిశీలకులు. అయితే రజనీకాంత్ చిత్రం విడుదల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఉంటుందా లేదా అని తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి నచ్చేలా సత్యభామ



థ్రిల్లర్ చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. సినిమాకు ఆయన ఇచ్చిన సంగీతం కంటే అందులోని నేపథ్య సంగీతంతోనే పాపులరైన శ్రీచరణ్.. తాజాగా మ్యూజిక్ అందించిన చిత్రం 'సత్యభామ'. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించగా.. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు.

"నేను కేవలం థ్రిల్లర్ మూవీస్‌కే ఎక్కువ వర్క్ చేస్తానని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ నాకు అన్ని రకాల సినిమాలకు సంగీతం అందించడం ఇష్టం. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అవి వేటికవే భిన్నంగా ఉంటూ.. అందరినీ ఆకట్టుకుంటాయి. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాజల్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. ఇందులోని యాక్షన్ ఎపిసోడ్స్ థియేటర్స్‌లో సినిమాను చూసే ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. పోరాట ఘట్టాల్లో ఆమె డూప్ లేకుండా చేశారు. కాజల్ కెరీర్‌లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్ సుమన్ ఈ సినిమాను తన మేకింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు" అని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది



యదార్థ సంఘటనల ఆధారంగా.. యూత్ ఆడియెన్స్‌కు మెప్పించేలా తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకరం ఈ టీనేజ్ లవ్ డ్రామాకు దర్శకత్వం వహించగా, భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ వేణున్, రామ్ పటాస్, తేజగౌడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనాథ్ పులకరం మాట్లాడుతూ "ఇందులోని లవ్‌స్టోరీ ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత భువన్‌రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ "ఈ సినిమా యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్:కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగజ్.

దిక్సూచి DIKSUCHI

స్టూడెంట్స్ చాయిస్ సీఎస్ఈ



గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హై పెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ***ఎన్.వి.రమణారావు*** *చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.*

కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్, సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్‌తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ ఆఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్ మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

కంప్యూటర్ ఇంజనీరింగ్: సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రోప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి): మెషిన్ కోడ్స్, కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

కెరీర్ అవకాశాలు



- ★ కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్/అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపుణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ఫోరెన్సిక్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- ★ గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

గణాంకాలు

ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఐటీ సెక్టార్‌లో ఓపెనింగ్స్ 50,000 ఉన్నాయి. మునుపటి సంవత్సరంతో పోల్చుకుంటే తగ్గుదల 21 శాతం. అంతకుముందు సంవత్సరం అంటే రెండేళ్ళ క్రితంతో బేరీజు వేసుకుంటే 60 శాతం తగ్గింది. లింక్డిన్, ఇతర జాబ్ బోర్డులను పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్క తేలుతోంది. డేటా శాంపిల్స్‌లో 80 శాతం ఒకే విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. ఎంట్రీ లెవెల్‌లో స్లంప్ ఇంకా బాగా చెప్పాలంటే పిరమిడ్‌లోని అట్టడుగున రిక్రూట్‌మెంట్స్ దాదాపుగా స్తంభించాయని చెప్పవచ్చు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మేర అట్రిషన్స్(ఒక కంపెనీని వదిలి ఇంకోచోటకు వెళ్ళడం) ఉంటోంది. అయినప్పటికీ కొత్తగా హైరింగ్ ఉండటం లేదు. ఇంకో మాటలో చెప్పుకొంటే హైరింగ్ విషయంలో రిక్రూటర్లు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ పరిణామాన్ని 'లో నుంచి నో హైరింగ్ యాక్షన్‌గా 'ఎక్స్‌ఫెనో' కోఫౌండర్ అభివర్ణించారు. ఈ తగ్గుదల రెండేళ్ళుగా కొనసాగుతోంది. అన్ని పరిశ్రమలను లెక్కలోకి తీసుకుంటే అందులో ఉండే వైట్-కాలర్ జాబ్స్ స్పేస్ 2,10,000. కాగా జనవరి 2022ని ప్రామాణికంగా తీసుకుంటే తగ్గుదల 35 శాతంగా నమోదైంది. ఐటి సర్వీసెస్ సెక్టార్‌లో ప్రస్తుతం సిస్టమేటిక్ కరెక్షన్ చోటుచేసుకుంటోందని 'లాంగ్‌హౌస్ కన్సల్టింగ్' సీఈఓ తెలిపారు. ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్లతో ఇప్పుడు క్యాంపస్‌లు నిండి ఉన్నాయి. నిజానికి వీరు ఇప్పుడు ఒకటి, రెండేళ్ళ అనుభవం ఉండి ఉద్యోగం పోగొట్టుకున్న వాళ్ళతో పోటీపడాల్సి వస్తోందంటూ పరిస్థితిని వివరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ఆ ప్రభావం ఇండియన్ టెక్నాలజీపై కూడా పడిందని డెలాయిట్ ఇండియా డైరెక్టర్ తెలిపారు. స్థూల ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చిత వాతావరణం ఫలితంగా క్లయింట్స్ చాలా అప్రమత్తంగా ఉంటున్నారని, ఇది రిక్రూట్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే రెండు క్వార్టర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతికంగా మెరుగుదల ముఖ్యంగా ఏఐ కూడా నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. దరిమిలా మారుతున్న వాతావరణానికి తగ్గట్టు ఎదిగితేనే ఐటీలో కుదురుకోవచ్చని, ఇది ఎప్పటికైనా రెండు వైపులా పదును ఉన్న కత్తే అని కూడా హితవు చెబుతున్నారు.

కంప్యూటర్ సైన్స్ అనే కాదు, ఏ బ్రాంచ్ తీసుకున్న విద్యార్థికి అయినా తన సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే జాబ్ మార్కెట్లో ఇతరులపై ఎడ్జ్ ఉంటుంది. అదే అనుకున్న లక్ష్యానికి చేరువ చేస్తుంది. అదేవిధంగా ఎంపిక చేసుకున్న రంగానికి సంబంధించి తదుపరి కోర్సులపై కూడా దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్డేట్ అవుతూ ఉండాలి. తద్వారా మరింత పరిణతి సాధించాలి. అంటే ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్(3ఎల్)కు అలవడాలి. మరోవైపు వాస్తవ పరిస్థితినీ గమనించాలి. పెద్ద ఎత్తున కోర్సులు అలాగే ఛాయిస్‌లు ఉన్న ఈ రోజుల్లో చదివిన కోర్సుకు తగ్గ ఉద్యోగం లభించడం, అందులో నిలదొక్కుకోవడం ఒక రకంగా కత్తిమీద సాము అనే చెప్పాలి. కంప్యూటర్ సైన్స్ విషయానికి వస్తే దాని పరిధి ఏటేటా విస్తృతమవుతోంది.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) లేదా డేటా సైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి బ్రాంచీలను తీసుకునే ముందు విద్యార్థులు కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. వాటిలో..

- మేథ్స్‌లో బలమైన పునాది ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఇది కీలకమైన సబ్జెక్టు. ఆల్జీబ్రా, కాలిక్యులస్, ప్రాబబిలిటీ, డిస్క్రీట్ మేథమెటిక్స్ చాలా ముఖ్యమైనవి.
- పైథాన్, జావా లేదా సి++ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు తెలిసి ఉండాలి. వేరియబుల్స్, లూప్స్, ఫంక్షన్స్, డేటాస్ట్రక్చర్స్ వంటి బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్‌లు తెలిసి ఉండాలి.
- కంప్యూటర్ల పనితీరుపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. సీపీయూ, మెమరీ, స్టోరేజ్, ఆపరేటింగ్ సిస్టమ్స్ తెలియాలి.

3ఎల్ తప్పనిసరి

- బేసిక్ అల్గోరిథమ్స్, డేటా స్ట్రక్చర్స్ అంటే ఆరేస్, లింక్డ్ లిస్ట్స్, స్టేక్స్ క్యూస్, ట్రీస్, సార్టింగ్ అల్గోరిథమ్స్ వంటి కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
- కంప్యూటర్ ఆర్కిటెక్చర్ బేసిక్స్ కూడా తెలియాలి. లాజిక్ గేట్స్, ప్రాసెసర్స్, మెమరీ హైరార్కీ, ఇన్‌పుట్/ఔట్‌పుట్ సిస్టమ్స్ వంటివి ఉపయోగకరం.
- సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ కూడా తెలియాలి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రాసెసస్, డిజైన్ ప్యాటర్న్స్, టెస్టింగ్ మెథడాలజీస్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- నెట్‌వర్కింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నెట్‌వర్క్స్, ప్రొటోకాల్స్, సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్ వంటివి ఇవాల్టి సాంకేతిక ప్రపంచంలో చాలా ముఖ్యం.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో తరచూ ఎదరయ్యే క్లిష్టమైన ప్రాబ్లెమ్స్‌ను సమర్థంగా పరిష్కరించగలగాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచి కెరీర్ మున్ముందు ఉంటుంది.

సమగ్ర కథనం 'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Iz9IMQyలో చదవండి.

అయోమయంగా ఆరోగ్యశ్రీ



- ప్రభుత్వం బిల్లులు ఇవ్వక.. వైద్యం దూరం
- సాధారణ సేవలకే నెట్‌వర్క్ ఆస్పత్రుల మొగ్గు
- అత్యవసర వైద్యసేవలకు వెళ్తున్న వారికి షాక్
- వైద్య పరీక్షల కోసం అదనంగా వసూళ్లు

రాజాం పట్టణానికి చెందిన ఓ కార్మికుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. హైబీపీతో బాధపడుతున్నాడు. ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన విజయనగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. తక్షణం ఆపరేషన్ చేయకుంటే ప్రాణాలు దక్కవని వైద్యులు చెప్పడంతో అప్పటికప్పుడు రూ.4 లక్షలు అప్పుచేసి కట్టాల్సి వచ్చింది. చేతిలో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా ఏం చేయలేని స్థితిలో కుటుంబసభ్యులు ఉండిపోయారు..

రాజాంలో ఓ భవన నిర్మాణ కార్మికుడు కొద్దిరోజుల కిందట సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. చేతికి, కాలికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చేతి గాయాలకే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని అక్కడున్న వారు చెప్పారు. ఇంతలో స్కానింగ్, ఇతర పరీక్షలంటూ రూ.10 వేలు అవసరమని డిమాండ్ చేశారు. దీంతో వేరే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి తీసుకెళ్లగా కాలి, చేతికి రెండింటికీ ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేశారు.



రాజాం:

ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర వైద్యసేవల కోసం వెళ్తున్న వారికి చుక్కెదురవుతోంది. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీకార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి రూ.25 లక్షల సాయం అందుతుందని చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు రకరకాలుగా కొర్రీలు పెడుతున్నాయి. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కోర్డినేటర్లు చెబుతున్నదానికి, ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నదానికి పొంతన ఉండడం లేదు. ప్రధానంగా నిరక్షరాస్యులు, పెద్దగా అవగాహన లేనివారు వెళ్తుంటే ముప్పతిప్పలు పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ కంటే సాధారణ వైద్యానికే మొగ్గుచూపుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం బిల్లులు పెండింగ్ పెడుతుండడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సాధారణ వైద్యానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ పరిధిలో 11 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రులతో పాటు మూడు ఏరియా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నారు. ప్రభుత్వం 3,255 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చింది. ఇందులో రెగ్యులర్ రుగ్మతలకు సంబంధించి ఆపరేషన్లు, వైద్యసేవలను చేర్చలేదన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. జనవరి 1 నుంచి ఇప్పటివరకు దాదాపు 30 వేల ఆపరేషన్లు, థెరపీలు చేసినట్టు ఆరోగ్యశ్రీ గణాంకాలు చెబుతున్నాయి. అయితే ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు మాత్రం తమకు ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని చెబుతున్నాయి. దాని కారణంగానే వారు ఆరోగ్యశ్రీ సేవల కంటే సాధారణ వైద్యసేవలకు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.
- ఆరోగ్యశ్రీ సేవలకుగాను ప్రతీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఒక కోఆర్డినేటర్‌ను నియమించారు. కానీ వీరు కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. గ్రామీణ ప్రజలకు ఈ సేవలు ఎలా పొందాలో అవగాహన ఉండదు. దీనికి ఏ ధ్రువపత్రాలు తీసుకురావాలో తెలియదు. అలాంటి వారు అత్యవసర వైద్యానికి వచ్చినప్పుడు ఓపికగా సమాధానం చెప్పాల్సిందిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పరిధిలో వైద్యసేవల కోసం రోగి చేరిన నాటి నుంచి ఆపరేషన్ తరువాత వసతి, భోజనం, మందులు అందించాల్సి ఉంటుంది. ఆరు నెలల వరకూ వారికి మందులు అందించాలి. కానీ ఇదెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. అటు బాధితులు కూడా అవగాహన లేక వినియోగించుకోలేక పోతు న్నారు. రోగికి వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, మందులు, భోజ నం, వసతి ఇవన్నీ లెక్కకట్టి బీమా మొత్తంలో తీసుకుంటా రు. అయితే కొన్ని ఆస్పత్రులు ఖ ర్చుకు మించి ఆరోగ్యశ్రీలో జమ చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

అర్హులందరికీ సేవలు..

జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగానే అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతోంది. ఇప్పటికే ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులుకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. సాధారణ వైద్యసేవల కంటే ఆరోగ్యశ్రీ సేవలకు ప్రాధాన్యమివ్వాలని సూచించాం. అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం

- అప్పలరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, విజయనగరం

ప్రకృతి వ్యవసాయానికి ఇదేనా ప్రోత్సాహం?

- జిల్లాలో 221 మందికి 16 నెలలుగా అందని గౌరవ వేతనం

బొబ్బిలి: తమ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పాలకులు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటోంది. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ సాగులో రైతులను ప్రోత్సహించేందుకు గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీజెడ్‌ఎన్‌ఎఫ్) పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ ఎఫ్) పేరుతో అమలు చేస్తున్నారు. దీనిలో జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న సుమారు 221 మంది సిబ్బందికి 16 నెలలుగా గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లించడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. వర్షాలు అనుకూలించే పరిస్థితి కనిపించడంతో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు సమాయత్తం చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 58 వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గౌరవ వేతనాలు లేకుండా సిబ్బంది రైతులను ఎలా సమాయత్తం చేయగలరనేది ప్రశ్నార్థకం.



కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

అందరిదీ అదే పరిస్థితి

ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (ఐసీఆర్‌పీ) స్థానికంగా సేవలు అందిస్తే నెలకు రూ.6 వేలు, ఇతర ప్రాంతాలలో కూడా పనిచేస్తే అదనంగా రూ.మూడు వేలు చెల్లిస్తారు. యూనిట్ ఇన్‌చార్జిలకు నెలకు రూ.11 వేలు, స్థానికేతర ప్రాంతంలో అయితే రూ.14 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. సబ్‌డివిజన్ యాంకర్‌కు రూ.36 వేల చొప్పున నెలవారీ వేతనం చెల్లించాలి. మాస్టర్ ట్రైనీలు కూడా ఉన్నారు. వీరందరికీ 16 నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. 2023 ఫిబ్రవరి నుంచి ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు వేతనాలు నిలిచిపోయాయి.

ఈ నెలలో అందిస్తాం

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న కార్యకర్తలకు గౌరవ వేతనాల కోసం కసరత్తు చేపట్టాం. ఈ నెలలో వారికి వేతనాలు బట్వాడా అవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈ సీజన్‌లో జిల్లాలో 58 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయానికి రైతులను సమాయత్తం చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

- ఆనందరావు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ విభాగం

తెలుగుదేశం హయాంలోనే ప్రోత్సాహం

వ్యవసాయ రంగానికి విశేషమైన ప్రోత్సాహం లభించాలంటే అది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే సాధ్యం. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం, నీటి పారుదల వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్నిరకాలుగా ప్రోత్సాహాలు అందించాలి.

- చొక్కాపు నారాయణరావు, రైతు, రంగరాయపురం

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 7,8,9 తరగతుల్లో మిగుల సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చొప్పున దరఖాస్తుతో పాటు చెల్లించాలన్నారు. ఈ నెల 11న ఉదయం 9 గంటలకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉచిత వేసవి బ్యాడ్మింటన్ శిబిరంలో భాగంగా శిక్షణ పొందుతు న్న 50మందికి సోమవారం క్రీడాదుస్తులు అందించారు. శిబిరం కోచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో దాతలు వీటిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం మహేశ్వరరావు దాతలను అభినందించారు.

మలేరియా వ్యతిరేక ర్యాలీ

కొత్తవలస: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి తెలిపారు. ప్రజలు మలేరియా జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలను తెలియజేస్తున్నట్టు తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడేగా పాటించాలని సూచించారు.

పేపర్‌క్రాఫ్ట్ మేకింగ్‌పై అవగాహన



పేపర్ క్రాఫ్ట్ మేకింగ్‌లో విద్యార్థులు

వేపాడ: వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ తయారీపై శిక్షణ ఇచ్చినట్టు గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: విద్యార్థులను చేర్పించాలని కోరుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. గజరాయనివలస, కామన్నవలస, ఎరుకులపాకలు, లక్ష్మీపురం, డొంకినవలస, వీరసాగరం, తెంటువలస, ముగడ, భీమవరం, పూడివలస, రామచంద్రాపురం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సత్యనారాయణ, బంగారు నాయుడు, శ్రీనివాసరావు, రామారావు, త్రినాథ, తిరుపతి, శంకరరావు, నారెమ్మ, విజయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

చినుకు పడితే కష్టమే!



అండర్ బ్రిడ్జికింద నీటిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తవలస: చినుకు పడితే చాలు కొత్తవలస జంక్షన్‌లోని అండర్ బ్రిడ్జి కిందకు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం అంతా కొత్తవలస ప్రాంత ప్రజలకు ఈ ఓవర్ బ్రిడ్జి వల్ల కష్టాలేనని చెప్పవచ్చు. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఈ బ్రిడ్జి కిందకు నీరు చేరింది. వర్షం రాత్రి 10 గంటల తరువాత పడడంతో కొంతవరకు ప్రజలకు ఇబ్బంది కలగకపోయినప్పటికీ... సోమవారం ఉదయం అవస్థలు పడ్డారు. పంచాయతీ సిబ్బంది నీటినీ తోడే ఏర్పాటు చేశారు. అండర్ బ్రిడ్జి కిందకు చేరిన నీటిని ఎప్పటికప్పుడు తోడించేందుకు రైల్వే శాఖ మోటార్లను ఏర్పాటు చేసింది. బ్రిడ్జి కిందకు చేరిన నీరు వెళ్లేందుకు కింద కాలువలు ఏర్పాటు చేసినప్పటికీ ఉపయోగం కనిపించడం లేదు.

కూటమి అధికారంలోకి రావడం తథ్యం

- రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం తథ్యమని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పోలింగ్ ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం జరిగే కౌంటింగ్‌లో కూటమి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని, అధికారులు ఇచ్చిన నిబంధనలు పాటించేలని కోరారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల నుంచి తీసుకొచ్చే సమ యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, పూర్తిస్థాయిలో ఫలితాలు వచ్చే వరకు ఎవరూ అశ్రద్ధ వహించవద్దని కోరారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకు ప్రతి ఏజెంట్ కేంద్రంలోనే ఉండాలని తెలిపారు. వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో కూట మికి అనుకూలంగా ఫలితాలు రావడం శుభసూచకమని చెప్పారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వానికి మింగుడు పడడంలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొళ్ల అప్పలనాయుడు, కోండ్రు జగదీష్, సుమల వెంకట మన్మథరావు, గురవనా నారాయణరావు, గట్టి భాను, కిమిడి అశోక్‌కుమార్, నంది సూర్యప్రకాష్ రావు, పిన్నింటి మోహన్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, వల్లూరి గణేష్ పాల్గొన్నారు.

పైడితల్లి సేవలో లలితకుమారి



పండితులతో ఆశీర్వాదం తీసుకుంటున్న కూటమి అభ్యర్థి లలితకుమారి

శృంగవరపుకోట: విజయనగరం శ్రీపైడితల్లమ్మను శృంగవరపుకోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సీఎంగా అధినేత నారాచంద్రబాబు నాయుడు, విశాఖ ఎంపీగా ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేగా తాను గెలవాలని కోరుకున్నట్టు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

సీపీఆర్‌పై అవగాహన



శిక్షణ ఇస్తున్న రమణ

రాజాం: రాజాంలోని జీఎంఆర్ఐటీ ఇంజినీరింగ్ కళా శాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై రెడ్‌క్రాస్ సొసైటీ మాస్టర్ ట్రైనర్ జి.రమణ సోమవారం శిక్షణ ఇచ్చారు. ప్రమాదాలు జరిగే సమయంలో ఏ విధంగా స్పందించాలి, పాముకాటు, రోడ్డు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, ఆర్‌జీవీ నా యుడు, డీఎఫ్‌వో గౌరీ పవన్, ఎన్‌ఎస్ఎస్ పీవో కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'శారదా' సిబ్బంది

కొత్తవలస: కంటకాపల్లి పంచాయతీలోనున్న శారదా మెటల్స్ అల్లాయస్ కర్మాగారం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం చినరావుపల్లి ఎంపీయూపీ స్కూల్, గ్రామ సచివాలయం ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కర్మాగార ఎమ్‌డీ ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యానికి మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఒక చెట్టును కొడితే 10 చెట్లను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కర్మాగార ప్రతినిధులు అనంత్ కుమార్, శతృఘ్నసింహ, విజయభాస్కర్, సన్యాసిరావు, శారదా మెటల్స్ కర్మాగార ఉద్యోగులు, చినరావుపల్లి సర్పంచ్ బి.దేముడు, మాజీ సర్పంచ్ బి.రమణ, హెచ్‌ఎం ఎం.రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో బస్సు పాసులు

శృంగవరపుకోట: కొత్త సాఫ్ట్ వేర్‌తో అన్నిరకాల బస్సు పాసులు జారీ చేస్తామని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి బస్‌స్టేషన్ పాస్ కౌంటర్ తెరుస్తామన్నారు.

బాలభవన్‌లో వేసవి శిక్షణ శిబిరం

రాజాం: రాజాంలోని బాలభవన్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈసందర్భం గా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా బాలభవన్ డైరెక్టర్ సుంకర రమే ష్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 12 వతేదీ నుంచి తరగతులకు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

కొత్తవలస: అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లోనున్న జేఎస్ఎల్ కర్మాగారానికి చెందిన కార్మికులు సోమవారం నిరసన దీక్షలు కొనసాగించారు. కర్మాగారంలోని కార్మికులందరికీ లే ఆఫ్ ప్రకటిస్తే నిరసన శిబిరం ఎత్తేయడానికి సిద్ధమని చెప్పారు. తమ సమస్య ఎంతకాలం పరిష్కరించకపోతే అంతకాలం నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్మికులందరికీ లే ఆఫ్ ప్రకటించడం గానీ... లాకౌట్ ఎత్తేసి కర్మాగారాన్ని తెరవడం గానీ.. కార్మికులకు కనీసం 20 రోజులైనా పని కల్పించడం గానీ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికులకు సంబంధించి ఏ ఒక్క డిమాండ్‌నూ పరిష్కరించకుండా మొండి వైఖరిని అవలంభిస్తోందన్నారు. ఒడిశాలోని జాజ్‌పూర్ యూనిట్‌కు పంపిస్తామని చెబుతున్నారని... అక్కడికి వెళితే స్థానిక కార్మికుల నుంచి వ్యతిరేకత వచ్చి తమపై దాడులు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పిల్లా అప్పలరాజు, కోన దేముడు, నమ్మి చినబాబు, బొట్టా రాము తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కోనేరులో పడి వ్యక్తి మృతి



వెంకటరావు (ఫైల్)

వేపాడ, జూన్ 3: తాగునీటి కోనేరులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లంపూడి గ్రామానికి చెందిన తాడాన వెంకటరావు(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లల చదువు నిమిత్తం భార్య హిందూ తన కన్నవారి గ్రామమైన లక్కవరపుకోట మండలం కొట్యాడలో ఉంటుండడంతో వెంకటరావు తన అక్క గండిపడాల కనక, మేనమామలతో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్తానని చెప్పి వెంకటరావు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామమంతా వెతికినా ఆచూకీ దొరకలేదు. అనంతరం సోమవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో వేపాడ కోనేటిలో ఎవరో పడి మృతి చెందారని వార్త రావడంతో మృతుడి కుటుంబసభ్యులు గుర్తించి, వెంకటరావు మృతదేహాన్ని బయటకు తీశారు. కోనేరులో స్నానం కోసం దిగి, ఈత రాక పోవడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి



సూరయ్య (ఫైల్)

దత్తిరాజేరు, జూన్ 3: పాముకాటుకు గురై గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. మండలంలోని భలభద్రరాజపురం గ్రామానికి చెందిన నక్కాన సూరయ్య (55) గొర్రెలు పెంచుతూ జీవనం సాగిస్తు న్నాడు. ఆదివారం గొబ్యాం గ్రామ పొలాల్లో గొర్రెలు మేపు తుండగా రాత్రి కురిసిన వర్షాలకు పొలంవద్దే ఉండిపోయాడు. ఈ క్రమంలో అక్కడ పాముకాటుకు గురయ్యాడు. తోటికాపర్లు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడుకి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

గంట్యాడ, జూన్ 3: హోం గార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గంట్యాడ గ్రామానికి చెందిన గొర్లె రమణ సోమవారం సాయంత్రం గంట్యాడ పోలీసులకు పిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొర్లె రమణ విజయనగరం పట్టణంలోని ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అదే సమయంలో ఇదే కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బద్రగిరి సాయి ప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. పట్టణంలోని ఒక రాజకీయ నాయకురాలితో పరిచయం ఉందని ఆమె ద్వారా హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో గొర్లె రమణ తనకు తెలిసిన నలుగురు యువకులతో కలిసి రూ.20 లక్షలు అడ్వాన్స్ ఇచ్చాడు. ఇందులో సాయి ప్రసాద్ బ్యాంకు ఖాతాకు రూ. 15 లక్షలు జమ చేయగా, మిగిలిన ఐదు లక్షలు నగదు రూపంలో ఆయనకు గత ఏడాది ఏప్రిల్ 17న ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల చొప్పున డబ్బులు అందజేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకూ హోంగార్డు ఉద్యోగాలు ఇవ్వలేదని, కనీసం తాను ఇచ్చిన డబ్బులైనా వెనక్కు ఇవ్వకుండా మోసం చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఆయనపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. దీనిపై గంట్యాడ హెడ్ కానిస్టేబుల్ గణపతిరావు వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు వచ్చిందని, కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

లావేరు: విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం పంచాయతీ మాజీ సర్పంచ్ గవిడి కృష్ణారావు (62) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణారావు తన గ్రామం నుంచి ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై లావేరు మండలం మురపాకలోని తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి సుభద్రాపురం జంక్షన్‌కు సమీపానికి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లావేరు హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరనారాయణ మెట్టపై ఆక్రమణలు



మెట్టపై ఇంటికి ఆనుకుని నిర్మిస్తున్న ప్రహరీ

శృంగవరపుకోట రూరల్: స్థానిక వీరనారాయణ మెట్టపై ఆక్రమణలు పెరుగుతున్నాయి. దశాబ్దం క్రితం గ్రామంలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో మెట్టపై రెండుసెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చారు. దీంతో అక్కడ కొంతమమంది ఇళ్లు కట్టుకొని ఉంటున్నారు. కొంతమంది మాత్రం తమకు ఇచ్చిన ఇంటిస్థలంతో సంతృప్తి చెందక మరి కొంత ఆక్రమిస్తున్నారు. గ్రామ పెద్దలు వద్దని చెబితే వారిపై తిరుగుబాటు చేస్తున్నారు. యథేచ్ఛగా ప్రహరీలు నిర్మిస్తున్నారు. ఈ విషయంపై వీఆర్‌వో మహాలక్ష్మిని వివరణ కోరగా.. ఇక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించామని చెప్పారు. తాము లేని సమయంలో కడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల పనుల్లో ఉన్నామని... కౌంటింగ్ పూర్తయ్యాక తహసీల్దార్ దృష్టిలో పెట్టి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

● కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి



మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం జరిగే కౌంటింగ్ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కార్యకర్తలను కోరారు. ఇతర పార్టీల ఏజెంట్లు కవ్వింపు చర్యలకు పాల్పడితే సహనం పాటించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు కట్టుబడి కౌంటింగ్ కేంద్రంలో ప్రవర్తించాలని చెప్పారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ర్యాలీలు నిర్వహించవద్దని కోరారు. సమావేశంలో గుమ్మలక్ష్మీపురం మండల టీడీపీ అధ్యక్షుడు, నాయకులు ప్రసాద్, మన్మథరావు పాల్గొన్నారు.

జయకృష్ణ విజయం తథ్యం

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అత్యధిక మెజార్టీతో గెలుపు తథ్యమని ఆ పార్టీఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బీపీ నాయుడు తెలిపారు. సోమవారం కుంబిడి ఇచ్ఛాపురంలో సర్పంచ్ గౌరునాయుడు, యువకులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జానీ, పుండరీకం, గోపాల్, హరీష్, వీర మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ర్యాలీలకు అనుమతి లేదు: సీఐ

గుమ్మలక్ష్మీపురం: కౌంటింగ్ అనంతరం ఎటువంటి ర్యాలీలకు అనుమతి లేదని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రికఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రత్యేకంగా భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచామని చెప్పారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని, కౌంటింగ్ పూర్తి కావడానికి వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కార్డన్‌సెర్చ్ నిర్వహించామని, శాంతిభద్రతల పరిరక్షణకు గిరిజన గ్రామాల్లో సభ్యులు ఏర్పాటు చేశామని తెలిపారు. వాహన తనిఖీలు క్రమం తప్పకుండా చేస్తున్నామని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పాలకొండ: నిబంధనలు ఉల్లఘించేవారిపై చర్యలు తప్పవని పాలకొండ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు లాడ్జిలు, కల్యాణ మండపాలను ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తనిఖీ చేశారు. లాడ్జిల్లో ఉన్న పలువురు నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనుండడంతో ప్రస్తుతం 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉండరాదని చెప్పారు. ఏ పార్టీ గెలిచినా గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతి లేదని తెలిపారు. సభలు, సమావేశాలు నిర్వహణకు అనుమతిలేదని, జనాలు గుమిగూడి రాదని, బాణసంచా, టపాసులు కాల్చరాదని చెప్పారు. డీజేలతో కూడుకున్న ఊరేగింపులు ఏర్పాటుచేయరాదని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు



పాతబస్టాండ్ కూడలిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద పట్టణ ఎస్ఐలు రవీంద్రరాజు, సంతోషికుమారి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు పార్లమెంట్‌తోపాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా కేంద్రంలో మంగళవారం 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. విజయం సాధించిన తర్వాత ఆయా పార్టీల అభ్యర్థులు ర్యాలీలు, బాణసంచా కాల్చరాదని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలని కోరారు.

సాలూరులో పోలీస్ పికెట్

సాలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సాలూరు రూరల్‌లో సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో కలిపి సోమవారం స్ట్రయికింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సాలూరు అర్బన్‌లో డబ్బివీధి, చిన్నవీధి, గొల్లవీధి తదితర ఐదు చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద ప్రత్యేక భద్రత కూడా ఏర్పాటు చేశారు. సాలూరు అర్బన్ సీఐ వాసునాయుడు, మరో ఇద్దరు ఎస్ఐలతో స్ట్రయికింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. కానిస్టేబుళ్లతో పట్టణంలో రూట్ వాచ్ నిర్వహిస్తున్నారు.

గొడవలకు పాల్పడవద్దు

కురుపాం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నుంచి ఎటువంటి అల్లర్లు జరగకుండా కురుపాం మెయిన్ రోడ్డులోని పలు వీధుల్లో గస్తీ తిరిగారు. ఈసందర్భంగా స్థానిక గాంధీనగర్ వీధిలో ఎన్నిక నిబంధనలపై అవగాహన, 144 సెక్షన్ అమలుపై అవగాహన కల్పించారు. మంగళవారం కౌంటింగ్ నేపథ్యంలో అందరూ సహకరించాలని, ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని అదే విధంగా బాణసంచాలు కాల్చడం, డీజే సౌండింగ్స్ పెట్టడం వంటివి చేయకూడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం కోసం బారులు



సాలూరులో మద్యం దుకాణం వద్ద బారులు

సాలూరు: ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మందుబాబులు సోమవారం భారీ సంఖ్యలో బారులుతీరారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు లెక్కింపు నేపథ్యంలో మద్యం షాపులు తెరవరన్న ఉద్దేశంతో ముందుగానే ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద భారీసంఖ్యలో ఎగబడ్డారు. కోరుకున్న బ్రాండ్లు దొరకకపోయినప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో ఉన్న బ్రాండ్లులో మద్యం సీసాలను కొనుగోలు చేశారు.

వీరఘట్టంలో చెట్టుపై పిడుగు



పిడుగుపాటుకు చనిపోయిన పక్షులు

వీరఘట్టం: వీరఘట్టంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోఉన్న ఓ చెట్టుపై ఆదివారం రాత్రి పిడుగు పడింది. దీంతో చెట్టుపై ఉన్న పక్షులు, చిలుకలు, కాకులు మృతిచెందాయి.

కిటికీలు ఊడి.. రికార్డులకు చెదలు పట్టి

● వర్షానికి కారుతున్న గదులు ● ఇదీ గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో పరిస్థితి



చెదలు పట్టిన కిటికీ



తలుపులు లేని కిటికీ

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో శిథిలావస్థకు చేరింది. మండల వ్యవస్థ ప్రారంభించిన సమయంలో నిర్మించిన భవనం కావడంతో బీటలు వారడంతోపాటు పెచ్చులూడుతున్నాయి. దీనికితోడు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా అందుబాటులోఉన్న ఆరు గదులు కూడా కారిపోతుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే గదుల్లోకి నీరుచేరుతోంది. దీంతో విలువైన రికార్డులు తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. భవనం ప్రారంభించిన తర్వాత రంగులు వేయకపోవడంతో పురాతన భవనంలా కనిపిస్తోంది. దీనికితోడు మూడు దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన కిటికీలు కావడంతో తలుపులు ఊడిపోతున్నాయి. నిర్వహణలోపం, నిర్లక్ష్యం పుణ్యమాని విలువైన రికార్డులకు చెదలుపుతున్నాయి. కార్యాలయం మొత్తం తలుపులు, కిటికీలు, రికార్డులకు చెదలుపడుతుండడంతో పాడవుతున్నాయి. దీంతో మండలానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం పాడైపోయే అవకాశముందని ఆందోళన నెలకొంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభంకావడంతో గదులు కారిపోతుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో కార్యాలయానికి సంబంధించి పలు పనులు నిర్వహించామని చెప్పి నిధులు మింగేసిన విషయంపై ఆరోపణలొచ్చాయి.ఈ మేరకు ఆడిట్ సమయంలో పనులు నిర్వహించకపోయినా నిర్వహించినట్లు రసీదులు చూపించడం ఆనవాయితీగా మారింది. కాగా గతంలో విధులు నిర్వహించిన ఎంపీడీవో ఏ పనులకు ప్రతిపాదనలు చేశారో తమకు తెలియదని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం కార్యాలయం పరిధిలో చెదలు తొలగించేందుకు, పలు సామగ్రి కొనుగోలు చేసి అసౌకర్యం నెలకొనకుండా చర్యలు చేపడతామని చెప్పారు.



సాలూరు రూరల్: మామిడిపల్లిలో యూనియన్ బ్యాంకు వద్ద బారులుతీరిన పింఛన్ లబ్ధిదారులు



సాలూరు: మునిసిపల్ కార్యాలయానికి వెళ్లేదారిలో ఉన్న సర్వీస్ ప్రొవైడర్ వద్ద పింఛనుదారులు

పింఛన్‌కోసం అగచాట్లు

● బ్యాంకులు, మీసేవా సెంటర్లు, సర్వీస్ ప్రొవైడర్ల వద్ద బారులుతీరిన లబ్ధిదారులు

సాలూరు: సాలూరు మండలంలోని పింఛన్ లబ్ధిదారులు సోమవారం అగచాట్లకు గురయ్యారు. వైసీపీ ప్రభుత్వం గతంలో వలంటీర్లతో పంపిణీ చేసేది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో వారి సేవలు నిలిచిపోవడంతో దివ్యాంగులు, 80 ఏళ్లుదాటిన వారికి మాత్రమే సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీచేశారు. మిగతా లబ్ధిదారులకు బ్యాంకుఅకౌంట్‌లో జమచేసేలా ఏర్పాట్లు చేశారు.దీంతో వారంతా పట్టణం, గ్రామీణ ప్రాంతంలోని పలు బ్యాంకుల వద్ద బారులు తీరారు. ప్రధానంగా పట్టణంలోని బ్యాంకులు, మీసేవా సెంటర్లు, సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తెల్లవారి నుంచే బారులుతీరారు. కొన్ని మీసేవా, సర్వీస్ ప్రొవైడర్ల వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరినప్పటికీ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పింఛన్ కోసం ఒక్క సాలూరు పట్టణమే కాకుండా మండలంలోని పలు గ్రామాలకు చెందిన పింఛన్‌దారులు, పాచిపెంట మండలంలో ఉన్న అనేక పంచాయతీలకు చెందిన పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద అవస్థలుపడ్డారు.

● **సాలూరు రూరల్:** సామాజిక పింఛన్లు బ్యాంకుల్లో జమ చేయడంతో పింఛనుదారులు సోమవారం డబ్బులు విత్‌డ్రా చేసేందుకు తిప్పలు పడ్డారు. మామిడిపల్లి, తోణాం బ్యాంకుల వద్ద ఉదయం నుంచే పడిగాపులు కాశారు. గిరిశిఖర గ్రామాలకు చెందిన పలువురు నడిచి వచ్చి పింఛను డబ్బులు తీసుకున్నారు. కురుకూటి సమీపంలో సర్వీస్ ప్రొవైడర్లు వద్ద పింఛను డబ్బులు తీసుకున్నారు.

కాశీవిశ్వేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



గరుగుబిల్లి: గిజబలో శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ నిర్వాసిత గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ప్రధాన రహదారికి ఆనుకుని శివాలయం ఉండటంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

ఎండలమల్లిఖార్జున ఆలయంలో పూజలు

వీరఘట్టం:కుంబిడి ఇచ్ఛాపురంలో ఎండల మల్లిఖార్జునస్వామికి సోమవారం పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా తాను గెలవాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఆయనతోపాటు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి నిమ్మక పాండురంగ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

● ఇదీ భామిని రంగులుగారి వీధిలో పరిస్థితి



భామిని రంగులుగారివీధిలో నిల్వఉన్న వర్షం నీరు

భామిని: భామినిలోని రంగులుగారివీధి చినుకుపడితే చిత్తడిగా మరుతోంది. వీధిమధ్యలో నీరు నిలిచిపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రాజావీధి పక్కన ఉన్న వీధిలో సగం వరకే రోడ్డు వేశారు. మిగిలిన భాగంలో విడిచి పెట్టడంతో వర్షం నీరు బయటకు వెళ్లడానికి వీల్లేక పోవడంతో ఒకచోట చేరి నిల్వ ఉంటోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో ఆ ప్రాంతమంతా బురదమయమయ్యింది. దీంతో స్థానికులతోపాటు ఈ వీధి గుండా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందిపడుతున్నారు. వీధి మధ్యలో నీరు నిల్వ ఉండడంపై గతంలో కూడా అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేయడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందని రంగులుగారివీధితో పాటు చుట్టుపక్కల వాసులు వాపోయారు.

రైతులకు బిల్లులు ఇవ్వాలి

● ఏడీఏ రత్నకుమారి

వీరఘట్టం: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏడీఏ రత్నకుమారి తెలిపారు. సోమవారం వీరఘట్టంలోని శ్రీసత్యనారాయణ విత్తనాలు, పురుగు మందుల షాపు తనిఖీ చేశారు. షాపులో ధరల పట్టిక, నిల్వ పట్టి, నిల్వ రిజిస్టర్లు సరిగా లేకపోవడం, కొనుగోలు చేసిన రైతులకు బిల్లులను సక్రమంగా ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న అజయ్ 231 ప్యాకెట్లు, నూజివీడుసీడ్స్ 496 ప్యాకెట్లు రైతులకు అమ్మవద్దని నిర్వాహకులకు కోరారు. కార్యక్రమంలో ఏవో సౌజన్య పాల్గొన్నారు.

పనివేళలు సక్రమంగా పాటించాలి: ఏపీవో



మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీవో ఈశ్వరమ్మ

మక్కువ: వేతనదారులు పనివేళలు సక్రమంగా పాటించి గరిష్ట వేతనం దక్కేలా పనులు చేయాలని ఉపాధి హామీ ఏపీవో శంభంగి ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని సన్యాసిరాజపురం వీఆర్ఎస్ కెనాల్‌లో పూడికతీత పనులు, కన్నంపేటలో ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతల ఆధారంగా పనులు చేయించాలని సూచించారు. మస్తర్ల నిర్వహణలో మేట్లు తప్పులు చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. పని కోసం జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ కార్డు అందేలా సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. మస్తర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పెద్దూరులో రహదారికి ఇరువైపులా చెత్త, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. సోమవారం పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న నిర్వహణ పనులను ఈవోపీఆర్‌డీ ఎల్‌గోపాలరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగు నిల్వలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నామని చెప్పారు. దోమలు ఆశించకుండా ఉండేలా పిచికారీతో పాటు క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. ఈ పరిశీలనలో ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టువీధి కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన

బలిజిపేట: బలిజిపేట మెట్టువీధి కాలనీ ప్రజలు 15 రోజులుగా దాహంతో అల్లాడిపోతున్నారు. ఈ మేరకు తాగునీటి కోసం మెట్టువీధి కాలనీలో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా బోను నాగమణి, కెల్ల పార్వతి, బోను లక్ష్మి తదితరులు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై పలుసార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. తక్షణమే స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 15 రోజులుగా నీటిని సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పొదుపుగా వినియోగిస్తున్నామని తెలిపారు.సమీపంలోని బోర్లలో ఉప్పునీటినే తాగుతున్నామని వాపోయారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురానికి నైట్‌హాల్ట్ బస్సు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురానికి నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును పార్వతీపురం ఆర్టీసీ డిపో అధికారులు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ప్రతిరోజూ రాత్రి ఎనిమిది గంటలకు పార్వతీపురంలో బయలుదేరి 9.30 గుమ్మలక్ష్మీపురం చేరు కుంటుందని డిపో అధికారులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం 5.20 గంటలకు గుమ్మలక్ష్మీపురంలో బయలుదేరి పార్వతీపురం వెళ్తుందని చెప్పారు. ఈ బస్సు వేయడంతో తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని గిరిజనులు చెబుతున్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

భామిని:మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన వృద్ధుడు శొంటన్న తవుడుకు సోమవారం ఉదయం ఆర్టీసీబస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. దిమ్మిడిజోల సెంటర్‌లో బస్సుఆగిఉంది. ఆ సమయంలో రోడ్డు దాటేందుకు తవుడు ప్రయత్నించాడు. శ్రీకాకుళం నుంచి బత్తిలి వైపు వస్తున్న బస్సు ఒక్కసారిగా ముందుకు వెళ్లడంతో ఢీకొంది. దీంతో కుడి భుజానికి గాయాలుకావడంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో కొత్తూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ నుంచి విశాఖపట్నం తరలిస్తున్నట్టు తవుడు అల్లుడు సింహాచలం తెలిపారు. ఈ మేరకు బత్తిలి ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలకొండలో ఖోఖో పోటీలు

పాలకొండ: పాలకొండ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఖోఖో పోటీలు డ్రాయింగ్ మాస్టార్ జి.మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన వారికి శిబిరం ఈనెల ఏడో తేదీన బహు మతులు అందించనున్నట్టు గ్రంథాల యాధికారి బబ్బురు గణేష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, గ్రంథ పాఠకులు పాల్గొన్నారు.



ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

సీతానగరం: పనుకుపేట గ్రామంలో ఏవో ఎస్.అవినాష్ చేతులమీదుగా సోమవారం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలోకి 10 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 3291, ఎంటీయూ 7029, బీపీటీ 5204, ఎంటీయూ 1318 రకాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే 144.18 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణపై వక్తృత్వ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానంచేస్తున్న నిర్వాహకులు

రాయగడ: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ మాన వుల బాధ్యత' అనే అంశంపై సోమవారం వక్తృత్వ పోటీలు ఉత్కళ మీడియా అధ్యక్షుడు దయానిధి ఖడంగా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉత్కళ మీడియా జర్నలిస్టుల సంఘంఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 21మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా శుభశ్రీపండా, కేవీజీ సాయిసాకేత్, స్వయంశ్రీ పండా గెలు పొందారు. న్యాయనిర్ణేతలుగా సీనియర్ న్యాయవాది ప్రదీప్‌కుమార్ దాస్, సాయిపబ్లిక్ పాఠశాల డైరక్టర్ సుస్మిత మహంతి వ్యవహరించారు. కార్యక్రమంలో ఇంపా పరిశ్రమ ప్రజా సంబంధాల అధికారి శక్తిప్రసాద్ పాణిగ్రాహి, అటవీ శాఖాధికారి అశోక్‌కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

రాయగడ: స్థానిక రైతు కాలనీలో అనాథలకు ఆసరాగా నడుస్తున్న నవజీవన్ ట్రస్టులోని అనా థలకు సాయప్రియ లేడీస్ వాకర్స్‌క్లబ్ సభ్యులు పౌష్టికాహారం, పాలు, బిస్కట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు బి.నళిని పాల్గొన్నారు.